# మరో గుణసుందరి కథ

'పాలేరు రామన్నకి చదువు లేదు కానీ, చదువుంటే ఆ ఊరికే ఒక పెద్ద జడ్జి అయ్యేవాడు' అంటారు అందరూ. ఎప్పుడు ఎవరికి ఏ సహాయం కావాలన్నా, ఏ ఇద్దరి మధ్య ఏ చిన్న గొడవ జరిగినా రామయ్య దగ్గరకు రావడం, రామయ్య తీర్పు వినడం, అలా నడుచుకోవడం, ఆ వూళ్ళో పరిపాటైపోయింది.

రామన్న మట్టిని నమ్ముకున్న మనసున్న మనిషి. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా అతని ధ్యాసంతా ఆ రెండెకరాల పొలం మీదే. విత్తులు నాటిన నాటి నుంచి, కోతలు పూర్తిచేసి, ధాన్యం బస్తాలు ఇల్లు చేరుకునే దాకా అతనికి వేరే ఆలోచనలే వుండవు.

అలా అని రామన్నకి భార్యాబిడ్డలు లేరనో, ఇల్లు పట్టదనో అనుకోకూడదు. రామన్నకి ఇద్దరు కొడుకులు ఒక కూతురూనూ. కుటుంబ నియంత్రణ నినాదాలతో పనిలేకుండానే తన ఇంగితజ్ఞానంతో ముగ్గురు పిల్లలు పుట్టగానే చాలని తాను ఆపరేషన్ చేయించుకోవడమే కాకుండా, బహుసంతానంతో కలిగే బాధల గురించి తన వూరి వాళ్ళందరికీ చెబుతూ, దగ్గరుండి ఆపరేషన్లు చేయించేవాడు. ఆ వూరి మునసబుగారికీ కరణంగారికీ రామన్న తల్లో నాలిక. మంచికి మారుపేరుగా ఆ గ్రామంలో రాజకీయ కుళ్ళు కుతంత్రాలను దరిజేరనీయకుండా, అందరూ కలిసికట్టుగా పనిచేసుకుంటూ వచ్చారు.

ఆ ఊళ్ళో మంచి హైస్కూలు పెట్టించారు. ఆసుపత్రి కట్టించారు. మునసబుగారూ, కరణంగారూ ఏ పని చెప్పినా వెంటనే హైదరాబాదు కొచ్చి, వాళ్ళు కలవమన్న వాళ్ళందరినీ కలిసి, వాళ్ళ గ్రామానికి కావలసిన ఏర్పాట్లను వాళ్ళు చేసుకుంటూ వచ్చారు. వాళ్ళ ఊళ్ళో ఒక చిన్న సూపర్‌బజార్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఊరివాళ్ళందరూ రామన్నని, పంచాయితీ ప్రెసిడెంట్‌గా ఉండమని ప్రాధేయపడ్డారు. తనకి ఏ పదవీ ఒద్దని, తను పుట్టిన గడ్డలో తన వాళ్ళందరికీ ఏం కావాలో అది చెయ్యడమే తన ధ్యేయమని అన్నాడు రామన్న. పాలేరు రామన్న కొడుకులిద్దరూ లవుడూ, కుశుడూ ఆ ఊళ్ళోనే మెట్రిక్ ఫస్టుక్లాస్‌లో ప్యాసయ్యారు. హైదరాబాదులో వుండి డిగ్రీ పూర్తి చేశారు.

ఎంట్రెన్స్ పరీక్షలు రాసి ఒకడు ఎంబిఏలోనూ మరొకడు కంప్యూటర్ కోర్సులోనూ చేరారు. లవుడూ, కుశుడూ పుట్టిన ఎనిమిదేళ్ళకి మరి పిల్లలు పుట్టరనుకున్న సమయంలో, వాళ్ళకి గుణసుందరి పుట్టింది. చాలాకాలం తరవాత గర్భం రావడంతో రామన్న భార్య

సుగుణవతికి కాన్పు కష్టమయింది. ఏది ఏమైతేనేం పండులాంటి పాపని చూసుకున్నాక, పడ్డ కష్టమంతా మర్చిపోయారు రామన్న దంపతులు. గుణసుందరి అందరికీ గారాలపట్టీ. పొలం వెళ్ళే వరకూ, పొలం నుంచి ఒచ్చాక, గుణసుందరితోనే రామన్న ఊసులు. ఆ మధ్యకాలంలో సుగుణవతి కొంగుచ్చుకు తిరుగుతూ, అల్లీ బిల్లీ ఆటలు, చిట్టీ పొట్టీ పాటలూ అన్నీ అమ్మ సమక్షంలోనే. సెలవులకి ఇంటికొచ్చిన అన్నయ్యలు లవుడు, కుశుడికి కూడా గుణ ఆరో(ప్రాణం.

కాలం జరుగుతూ వుంది. లవుడు, కుశుడు చదువుల వల్ల పట్టణానికే అంకితమైపోయారు. దాంతో రామన్నకీ సుగుణవతికీ కబుర్లు కాలక్షేపం అంతా గుణసుందరే. కాలు కిందపెడితే మట్టి అంటుకుంటుందని కాలు కింద పెట్టనియ్యకుండా పెంచారు రామన్న దంపతులు. బడికి పంపితే ఎక్కడ ఏమౌతుందోనని తనకి తెలిసిన అక్షరం ముక్కలు ఇంటి దగ్గరే నేర్పించాడు రామన్న. ఆ తరవాత మాస్టర్ని ఇంటికి పిలిచి ఇంటి దగ్గరే రాయడం చదవడం నేర్పించారు.

గుణకి పాటలంటే చాలా ఇష్టమని, సంగీతం నేర్పించారు. అపర సరస్వతిలా వీణ మీటుతూ పాడుతుంది. ఈడొచ్చిన గుణ అందాల భరిణగా తయారైంది. గుండ్రని ముఖం, చక్రాల్లాంటి కళ్ళూ, పచ్చటి శరీరచ్ఛాయ, ఒత్తుగా పొడవుగా వున్న నల్లని కురులు. ఒకసారి చూస్తే దృష్టి మరలకుండా మళ్ళీ మళ్ళీ చూడాలనే రూపం అది. 'అసలైన సిసలైన తెనుగింటి ఆడపడుచు గుణసుందరి' అంటే అతిశయోక్తి కాదు. అపురూపమైన సౌందర్యంతోపాటు, తల్లిదండ్రుల మంచితనాన్ని పుణికిపుచ్చుకుంది గుణసుందరి. అందుకే ఏరికోరి పొరుగూరి కరణంగారు గుణసుందరిని తన కోడలిగా చేసుకున్నారు పాలేరు బిడ్డ అని కూడా సందేహించకుండా వర్ణ భేదాలను కూడా ఛేదించి.

ఊరంతా పందిరి వేసి రెండు ఊళ్ళనీ కలుపుతూ సన్నాహాలు చేశాడు రామన్న. అన్నలిద్దరూ చెల్లెలికోసం, బావగారి కోసం ఏదైనా అడిగితే చాలు రెక్కలు కట్టుకు వెళ్ళి తెచ్చిపెట్టేవారు. ఆత్మీయుల మధ్య, ఆనందంగా పెళ్ళికూతురై అత్తవారింట్లో అడుగుపెట్టింది గుణసుందరి ప్రదీప్‌కి భార్యగా. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోవడం, వాళ్ళ శరీరంలో ఒక భాగం పోయినట్టుగా బాధపడ్డారు రామన్న దంపతులు. అందుకే ఎక్కువ రోజులు గడవకుండానే లవుడుకీ, కుశుడికీ వెంట వెంటనే పెళ్ళిళ్ళు చేసేశాడు రామన్న. కొత్తకోడళ్ళ మురుపూ, వేడుకలూ బాగానే సాగాయి. కొడుకులిద్దరూ పల్లెటూళ్ళో వుండమనడం వల్ల, రామన్న అయిష్టంగానే తాను నమ్ముకున్న మట్టిని అమ్ముకుని వున్న వూరు విడిచి తనవాళ్ళతో కలిసి వుండటానికి పట్నం వెళ్ళిపోయాడు, భార్యని వెంటబెట్టుకుని.

కన్నవారు దూరమైనా, కొత్త సంసారమైనా, భర్త అనురాగంతో బాధని మరిచిపోయి, ఆనందంగా కాపురం చేసింది గుణసుందరి. సంవత్సరం తిరక్కుండా ఇద్దరు కవలలను కన్నది. ఇందిర, వసుంధరలు నందివర్ధనాల్లా అందంగా, ఉల్లాసంగా అమ్మానాన్నల ఆలనలో అమ్మమ్మ, నానమ్మ తాతయ్యల గారంతో పెరుగుతూ వచ్చారు.

అంత సంతోషాన్ని భరించలేని విధికి కన్నుకుట్టిందేమో నన్నట్టు ఆకస్మిక గుండెపోటుతో గుణసుందరి భర్త ప్రదీప్‌ని మృత్యువులోకి తోసింది. ఒక్కసారిగా ఆకాశం మబ్బుపట్టినట్టు, ఉప్పెన వచ్చినట్టు, మిన్ను విరిగి మీద పడ్డట్టు గుణసుందరి అల్లల్లాడిపోయింది. మామగారు మంచం పట్టడంతో, వ్యాపారాలన్నీ గుణ మరిది ఆకాశ్ మీద పడ్డాయి.

అతడి కళ్ళు ఆశతో మెరిశాయి. మనసు ఆకాశహర్మ్యాలు నిర్మించింది. ప్రదీప్ షేర్స్ డబ్బు, బ్యాంక్ అక్కౌంట్లు అన్నీ కళ్ళముందు కదలాడాయి. గుణసుందరి మంచితనం, అమాయకత్వం అతని ఆశలకి తోడయ్యాయి. అన్నింటినీ మించి ఆమెకి అక్షరం ముక్కలు తప్ప ఇంగ్లీషుగానీ, మరే విధమైన భాషా పరిజ్ఞానం గానీ లేదని తెలుసుకున్న ఆకాశ్ అన్ని కాగితాలమీదా ప్రదీప్ ఆస్తిపాస్తులతో తనకే సంబంధమూ లేదనీ, అంతా ఆకాశ్ ఇష్టమేననీ రాయించి స్టాంపు పేపర్లమీద గుణసుందరి సంతకాలు తీసుకున్నాడు.

అందులో ఏముందో తెలీక సంతకాలు పెట్టిన గుణసుందరి ఒకనాటి ఉదయాన కట్టుబట్టలతో, కన్న కూతుళ్ళతో ఇంట్లోంచి తరమబడింది.

అత్తమామలు పెదవి విప్పలేదు. ఊరివారి తీర్పు ఆమె సంతకాలు చేసిన కాగితాలపైనే ఇవ్వబడింది. అన్నయ్యలిద్దరినీ అంత చదువులు చదివించి, తనని అజ్ఞానంలో పెంచిన అమ్మానాన్నలని మొదటిసారిగా దూషించింది గుణసుందరి. అన్నలు అవునన్నా వదినలు వారి పంచన చేరనివ్వలేదు గుణసుందరిని.

ముసలి అమ్మానాన్నలని తన దగ్గరుంచుకుని, సంగీత పాఠాలు చెబుతూ, తన బిడ్డలు ఇందిరా, వసుంధరలను పట్నంలో చదివించింది గుణసుందరి. ఆడపిల్ల అందమైన జీవితం గాజుగ్లాసులా పగిలిపోకూడదనీ, ఆడతనం, అబలత్వం అనే మాటలని తన జీవితపు నిఘంటువులోనుంచి తొలగిస్తూ, ప్రతీ ఆడపిల్లనీ చదివించాలని ఇంటింటికీ వెళ్ళి బోధిస్తూ వచ్చింది గుణసుందరి. ఇందిర, వసుంధరలు ఒకరు డాక్టరూ, ఒకరు లాయరు అయ్యారు. గుణసుందరికి ఇద్దరూ రెండు కళ్ళు. కేవలం మమతానుబంధాల చట్రంలో తుళ్ళుతూ తూలుతూ పెరిగినవారు కాదు. వివేకంతో, విజ్ఞానంతో, ఆత్మవిశ్వాసంతో, ఆత్మ స్థైర్యంతో, ఏ సమస్యనైనా ఎదుర్కోగల గుండె నిబ్బరంతో పెరిగిన ధీరులు వాళ్ళు.

గుణసుందరి గుండెనిండా తృప్తే! తన కూతుళ్ళే కాదు. కనిపించిన ప్రతీ ఆడపిల్లకీ విద్యయొక్క ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఎనలేని ఆనందాన్ని అనుభవిస్తోంది గుణసుందరి.

రామన్న - ఎందరికో ఎన్ని రకాల తీర్పులనో ఇచ్చిన - పాలేరు రామన్న ఇప్పుడు 'ఆడపిల్లను ఎంత గారాబంగా పెంచామో, ఎంత ఆస్తినిచ్చామో' అని కాదు, ఆమెకి ఎంత చదువు చెప్పించాం? ఎంత విజ్ఞానాన్నందించామని బేరీజు వేసుకోవాలి' అని బోధిస్తూంటాడు.

చదువులతల్లి ఆడపిల్ల కాదూ! మరి మన ఆడపిల్లలెందుకు చదువుల తల్లులు కాకూడదు? అంటూ ప్రశ్నిస్తాడు రామన్న.

'అవును కదూ! అందరూ ఆలోచించండి మరి'. ఇందిరా వసుంధరలు వంతపాడారు తాతయ్య మాటకి తాళం వేస్తూ.

* * *

కథా నిలయం
55795
శ్రీకాకుళం